

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 13-09-2026 | సంపుటి - 31 | సంచిక - 111 | రూ : 4 | పేజీలు: 8


### శాంతిభద్రతలకు

# విఘాతం కలగొద్దు



## మండపాలకు ప్రముఖులను ఆహ్వానిస్తే ముందస్తు సమాచారం ఇవ్వాలి



- గణేశ్ ఉత్సవ ఏర్పాట్ల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: గణపతి మండపాలకు ప్రముఖులను అతిథులుగా ఆహ్వానిస్తుంటే.. ఆ సమాచారాన్ని ముందుగా సంబంధిత పోలీస్ కమిషనరేట్‌కు తెలియజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వాహకులకు పిలుపునిచ్చారు. నిర్వాహకులిచ్చే సమాచారంతో ముందస్తు భద్రత ఏర్పాట్లు చేసుకోవచ్చని, తొక్కిసలాట, ఊహించని పరిణామాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు. వినాయక చవితి ఏర్పాట్లపై సీఎం శనివారం అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు.

తరువాయి 2లో

### ధరణిని అడ్డుపెట్టుకుని

## నాడు యథేచ్ఛగా అక్రమాలు

- నిషేధిత జాబితా పేరిట కుంభకోణాలు
- లబ్ధిదారుల్లో హరీశ్‌రావు మామ, గంగుల కమలాకర్
- రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి



హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో ధరణిని అడ్డంపెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ప్రభుత్వ భూములు, రక్షణ శాఖ భూములను కూడా కొట్టేశారని ప్రభుత్వం పేర్కొంది. నిషేధిత జాబితాలోని భూములను తమకు కావలసిన వారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు గంట సేపు తొలగించడం, మళ్లీ నిషేధిత జాబితాలో పెట్టడం చేశారని, ఇలా ఒక చోటే 260 ఎకరాల భూమికి 300 రిజిస్ట్రేషన్లు జరిగాయని, ఇందులో మాజీ మంత్రి గంగుల కమలాకర్ కూడా ఐదెకరాలు రిజిస్టర్ చేయించుకొన్నారని తెలిపింది. 22ఏపై శనివారం శాసనసభలో జరిగిన చర్చలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. శాసనసభలో ప్రభుత్వం వెల్లడించిన వివరాలివీ...

**హరీశ్ మామకు లబ్ధి ఇలా...**

"సిద్దిపేట జిల్లా కొండపాక మండలం, వెలికట్ట గ్రామంలోని సర్వే నం.271లో గల సర్కారు భూముల్లో ఎసైన్డ్ పట్టాలు ఇవ్వగా 2010, 2011లలో 6.18, 4.32 ఎకరాలను భారాస నేత హరీశ్‌రావు మామ మాధవరం హనుమంతరావు కొనుగోలు చేశారు. వీటిలో 6.18 ఎకరాలకు మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధుల

తరువాయి 2లో

# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి




- సహకార స్ఫూర్తితోనే బ్రిక్స్ ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సులో నేతల భేటీ
- 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'కు ఏకగ్రీవంగా ఆమోదం
- ఐక్యత చాటుతూ వృక్షోత్సవంలో పాల్గొన్న ప్రపంచ నేతలు
- బ్రిక్స్ 20 ఏళ్ల వేడుకల సందర్భంగా రెండు పోస్టల్ స్టాంపుల విడుదల

2లో



### క్యాబ్ డ్రైవర్ల సమ్మె

## శంషాబాద్‌లో ప్రయాణికుల అవస్థలు

- సమ్మె బాట పట్టిన సుమారు 25,000 మంది డ్రైవర్లు
- ప్రభుత్వ జీవో 46 అమలు చేయాలని ప్రధాన డిమాండ్
- ఓలా, ఉబెర్, రాపిడో ఎయిర్‌పోర్ట్ రైడ్స్‌ను బహిష్కరించిన యూనియన్
- కిలోమీటర్‌కు రూ. 21 బదులు రూ. 12 మాత్రమే ఇస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్

తరువాయి 2లో

### గణేశ్ మండపాలకు

## అదానీ పవర్ ఆఫర్



- ముంబై గణేశ్ మండపాలకు రెసిడెన్షియల్ ధరలకే విద్యుత్
- దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే తాత్కాలిక కనెక్షన్ మంజూరు
- గతేడాది 1000కి పైగా మండపాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా
- 167 విగ్రహ నిమజ్జన ప్రాంతాల్లో 2,958 ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు
- భక్తుల భద్రత కోసం నిర్వాహకులకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ

2లో

### ఢిల్లీ చేరిన జిన్‌పింగ్..

## ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగు

- బ్రిక్స్ సదస్సులో పాల్గొననున్న జిన్‌పింగ్
- మోదీ-జిన్‌పింగ్ మధ్య జరగనున్న ద్వైపాక్షిక భేటీ
- గల్వాన్ తర్వాత సంబంధాలపై చర్చకు ప్రాధాన్యం
- సరిహద్దుల్లో శాంతిపై భారత్ స్పష్టమైన వైఖరి
- విభేదాలను పరిష్కరించేందుకు చైనా సిద్ధమని ప్రకటన



2లో

### ఎల్‌ఓసీ వద్ద ప్రశాంతత

# ఫేక్ న్యూస్‌పై ఆర్మీ స్పష్టత

- ఎల్‌ఓసీ వద్ద ఉగ్ర కార్యకలాపాలు పెరిగాయన్న వార్తలను ఖండించిన ఆర్మీ
- కుప్వారా, బారాముల్లాలో ఇళ్లు ఖాళీ చేయిస్తున్నారన్నది తప్పుడు ప్రచారం
- సోషల్ మీడియాలో పాకిస్థాన్ ఆధారిత ఖాతా దుష్ప్రచారం చేస్తోందని వెల్లడి
- సైన్యం మోహరింపు పెరిగిందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టీకరణ
- సమాచారాన్ని నిర్ధారించుకున్నాకే షేర్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి



2లో



### అమెరికాకు కౌంటర్

## ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం

- అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా ఆగ్రహం
- ప్రతిస్పందనగా తూర్పు సముద్రంలోకి పలు బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం
- కొరియా ద్వీపకల్పంలో మరోసారి పెరిగిన ఉద్రిక్తత

కొరియా ద్వీపకల్పంలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ కలిసి నిర్వహించిన "ఫ్రీడమ్ ఎడ్జ్" త్రైపాక్షిక సైనిక విన్యాసాలు ముగిసిన ఒక్క రోజు

తరువాయి 2లో

# శాంతిభద్రతలకు విఘాతం కలగొద్దు

హైదరాబాద్: గణపతి మండపాలకు ప్రముఖులను అతిథులుగా ఆహ్వానిస్తుంటే.. ఆ సమాచారాన్ని ముందుగా సంబంధిత పోలీస్ కమిషనరేట్‌కు తెలియజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వాహకులకు పిలుపునిచ్చారు. నిర్వాహకులిచ్చే సమాచారంతో ముందస్తు భద్రత ఏర్పాట్లు చేసుకోవచ్చని, తొక్కిసలాట, ఊహించని పరిణామాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు. వినాయక చవితి ఏర్పాట్లపై సీఎం శనివారం అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. "భారీగా భక్తులు పాల్గొనే వినాయక నవరాత్రుల్లో భాగంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్త వహించాలి. అందుకు మండపాల నిర్వాహకులు సహకరించాలి. భక్తులకు అసౌకర్యం కలగకుండా మున్సిపల్, పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత సంప్రదాయాన్ని పునరుద్ధరించాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నాం. మండప నిర్వాహకులు దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్తు పొందాలి. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారమిస్తే.. పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణ సులువవుతుంది. హైడ్రా, మున్సిపల్ కార్పొరేషన్లు అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి. ఉత్సవాలు ముగిసేవరకు పోలీసులు, మున్సిపల్ అధికారులు మండపాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయండి. పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించుకోండి. హైదరాబాద్‌లో గణపతి ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి. నగరం ప్రశాంతంగా ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి" అని సీఎం గుర్తుచేశారు. సమీక్షలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**పి.ఎస్.మూర్తి 'వారధి' పుస్తకావిష్కరణ**

స్వతంత్ర సమరయోధుడు పి.ఎస్.మూర్తి జీవిత చరిత్రకు సంబంధించిన 'వారధి' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, పి.ఎస్.మూర్తి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పి.ఎస్.మూర్తి 100వ జయంతి సందర్భంగా ఆయన కుమారుడు, తెలంగాణ అసెంబ్లీ ఓఎస్‌డీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పి.శ్రీకాంత్ ఈ పుస్తకాన్ని రచించగా.. ఏపీలోని రాజమహేంద్రవరానికి చెందిన రచయిత శ్రీపాద శ్రీనివాస్ కూర్పు బాధ్యతలను వహించారు.




# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి

సహకార స్ఫూర్తితో ముందుకు సాగుతూ, మరింత సమ్మిళితమైన, సంపన్నమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు బ్రిక్స్ సభ్యదేశాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం ప్రారంభమైన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యతకు, ఉమ్మడి లక్ష్యాల సాధనకు ఈ వేదిక నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల అధినేతలు భారత్ మండపంలో ఏర్పాటు చేసిన వృక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో పాటు ఇతర సభ్య, భాగస్వామ్య దేశాల నేతలు ప్రధాని మోదీతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నేతలందరూ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని సామూహిక చిత్రానికి (గ్రూప్ ఫొటో) పోజులిచ్చి, తమ ఐక్యతను చాటిచెప్పారు. సదస్సులో భాగంగా 'సమ్మిళిత ప్రపంచ పాలన, బహుపాక్షికతను బలోపేతం చేయడం' అనే అంశంపై చర్చలు జరిగాయి. ఈ భేటీలో "న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026"ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. బ్రిక్స్ కూటమి ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు ప్రత్యేక పోస్టల్ స్టాంపులను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "ఈ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను సత్ఫలితాలుగా మార్చడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.

# ధరణిని అడ్డుపెట్టుకుని నాడు యథేచ్ఛగా అక్రమాలు

హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో ధరణిని అడ్డంపెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ప్రభుత్వ భూములు, రక్షణ శాఖ భూములను కూడా కొట్టేశారని ప్రభుత్వం పేర్కొంది. నిషేధిత జాబితాలోని భూములను తమకు కావలసిన వారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు గంట సేపు తొలగించడం, మళ్లీ నిషేధిత జాబితాలో పెట్టడం చేశారని, ఇలా ఒక చోటే 260 ఎకరాల భూమికి 300 రిజిస్ట్రేషన్లు జరిగాయని, ఇందులో మాజీ మంత్రి గంగుల కమలాకర్ కూడా ఐదెకరాలు రిజిస్టర్ చేయించుకొన్నారని తెలిపింది. 22ఏపై శనివారం శాసనసభలో జరిగిన చర్చలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. శాసనసభలో ప్రభుత్వం వెల్లడించిన వివరాలివీ...

**హరీశ్ మామకు లబ్ధి ఇలా...**

"సిద్దిపేట జిల్లా కొండపాక మండలం, వెలికట్ట గ్రామంలోని సర్వే నం.271లో గల సర్కారు భూముల్లో ఎసైన్డ్ పట్టాలు ఇవ్వగా 2010, 2011లలో 6.18, 4.32 ఎకరాలను భారాస నేత హరీశ్‌రావు మామ మాధవరం హనుమంతరావు కొనుగోలు చేశారు. వీటిలో 6.18 ఎకరాలకు మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధుల కేటగిరీలో 11.92 లక్షల భూసేకరణ పరిహారం పొందారు. మిగిలిన 4.32 ఎకరాలను తన అల్లుడి పరపతి ఉపయోగించి 2023 ఆగస్టు ఒకటిన 22ఎ నుంచి తొలగించి పట్టా భూమిగా మార్పు చేసుకున్నారు.

**ఒకే కుటుంబానికి 112 ఎకరాలు**

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పలతుర్తి గ్రామం సర్వే నంబరు 58, 59లలో మొత్తం 546 ఎకరాల 39 గుంటల భూమి ఉండగా అందులో 112 ఎకరాల 21 గుంటలను 22ఎ నుంచి తొలగించి ఒకే కుటుంబానికి (సిరిపురం కుటుంబం) ఆక్యుపేషన్ రైట్స్ సర్టిఫికెట్ ద్వారా ధారాదత్తం చేశారు. ఇది ప్రభుత్వ దృష్టికి రావడంతో దీన్ని అదనపు కలెక్టర్ వద్ద అప్పీల్ చేసి నిలిపివేశాం. ఆ తర్వాత 195 ఎకరాల 25 గుంటల ప్రభుత్వ భూమిని కూడా 22ఎ నుంచి తొలగించారు. ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, స్థానిక తహసీల్దార్‌లను పట్టుకున్నారు. ఈ భూమిని సైతం మళ్లీ 22ఎలో చేర్చాం.

*** 2 మండలాల్లో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం మండలాల్లో భూ కబ్జాలతో పాటు ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరు గ్రామం సర్వే నంబరు 44లోని మొత్తం 40 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిలో.. 1985లో నలుగురు రైతులకు 22 ఎకరాలు ఎసైన్ చేయగా, అది నిబంధనలకు విరుద్ధమని 2007లో ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకుంది. 2022లో అప్పటి ప్రభుత్వ పెద్దల ప్రోద్బలంతో అదనపు కలెక్టర్ ఆ ఎసైన్డ్ భూమిని పట్టా భూమిగా మార్చారు. పల్లె గోపాల్‌గౌడ్ భార్య సులోచన పేరుతో ఆ భూమిని పట్టాగా మార్చి పాస్‌బుక్‌లు ఇవ్వడమే కాకుండా వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ కూడా చేశారు. దీనిని ప్రజా ప్రభుత్వం మళ్లీ 22ఏలో చేర్చింది. ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల గ్రామం సర్వే నంబరు 44లో 13 ఎకరాల 16 గుంటలు సీలింగ్ భూమి ఉంది. 1983లో కళ్యాణ శంకర్‌రెడ్డి ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఈ సీలింగ్ భూమిని, నిబంధనలు ఉల్లంఘించి 2022లో ఒక రియల్ ఎస్టేట్ కంపెనీకి 38ఇ కింద పట్టాగా కట్టబెట్టారు. ప్రజా ప్రభుత్వం ఈ భూమిని కూడా 22ఏలో పెట్టి అదనపు కలెక్టర్ కోర్టు ద్వారా తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియ చేపట్టింది.

**శంకర్ హిల్స్‌లో...**

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామ పరిధిలోని శంకర్ హిల్స్‌లో సర్వే నంబరు 111 నుంచి 191 వరకు మొత్తం 460 ఎకరాల పట్టా భూమిని కొందరు జీపీఏ తీసుకొని ప్లాట్లుగా, ఎకరాల వారీగా విక్రయించగా.. దానిపై హైకోర్టు, సివిల్ కోర్టులు స్టేటస్‌కో ఇచ్చాయి. 2022లో ఈ 460 ఎకరాలను గత ప్రభుత్వం 22ఏలో పెట్టింది. ఆ తర్వాత అందులో 226 ఎకరాల 6 గుంటల భూమిని రాత్రికి రాత్రి 22ఏ నుంచి తొలగించి, కేవలం గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ఆ వెంటనే మళ్లీ ఆ భూమిని నిషేధిత జాబితాలో చేర్చారు. ఈవిధంగా ఏడాదిలో దాదాపు 100 సార్లకు పైగా జాబితాలో పెట్టడం, మార్చడం జరిగాయి. ఇక్కడ ఎకరా ధర రూ. 150 కోట్లుగా ఉంది. మొత్తం భూమి విలువ సుమారు రూ.30,000 కోట్లు కాగా... మాజీ మంత్రి గంగుల కమలాకర్ తదితరులు ఇందులో 5 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

**ఇనాం భూముల కుంభకోణం**

మెదక్ జిల్లా శివంపేట మండలం సికింద్రాపూర్ గ్రామం సర్వే నం.33 నుంచి 87లో 569 ఎకరాల 5 గుంటల ఇనాం భూములు ఉండగా దానిని 2001లో వక్ఫ్ బోర్డు గెజిట్ చేసింది. దానిపై హైకోర్టులో కేసులు దాఖలు అయ్యాయి. గత శాసనసభ ఎన్నికలకు ముందు 2023 అక్టోబరు 5న ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో 372 ఎకరాల 32 గుంటల భూమికి నర్సాపూర్ ఆర్డీవో హక్కు పత్రాలు ఇచ్చారు. అందులో ఒక ఆంధ్రా బడా కంపెనీ జోక్యం చేసుకొని ఆక్యుపేషన్ రైట్స్ సర్టిఫికెట్ ఇప్పించి వాటిని మళ్లీ రియల్ ఎస్టేట్ వారికి కట్టబెట్టారు.

# గణేశ్ మండపాలకు అదానీ పవర్ ఆఫర్

ముంబైలో త్వరలో ప్రారంభం కానున్న గణేశ్ ఉత్సవాల సందర్భంగా నగరంలోని మండపాలకు అండగా నిలుస్తున్నట్లు అదానీ ఎలక్ట్రిసిటీ ప్రకటించింది. ఉత్సవాల కోసం ఏర్పాటు చేసే మండపాలకు నివాస గృహాలకు వర్తించే ధరలకే (రెసిడెన్షియల్ రేట్లు) తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే కనెక్షన్ మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. పండగ స్ఫూర్తిని నిరంతరాయ విద్యుత్‌తో జరుపుకునేలా చూడటమే తమ లక్ష్యమని అదానీ ఎలక్ట్రిసిటీ ప్రతినిధి తెలిపారు. "గణేశ్ మండపాలకు నమ్మకమైన తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు అందించడం ద్వారా ఉత్సవాలు ఎలాంటి అంతరాయం లేకుండా జరిగేలా చూడాలనుకుంటున్నాం. మా వినియోగదారులకు సేవ చేయాలన్న మా నిబద్ధతకు ఇది నిదర్శనం" అని ఆయన వివరించారు. తాత్కాలిక కనెక్షన్ కోసం మండపాల నిర్వాహకులు తమ అధికారిక వెబ్‌సైట్ adanielectricity.com లోని 'న్యూ కనెక్షన్' విభాగాన్ని సందర్శించాలని సూచించింది. "గతేడాది నగరవ్యాప్తంగా 1,000కి పైగా గణేశ్ మండపాలకు నిరంతరాయ విద్యుత్‌ను విజయవంతంగా అందించాం. ఈసారి కూడా కనెక్షన్ల ఆమోదాన్ని వేగవంతం చేయడానికి, పండగ మొత్తం నమ్మకమైన సరఫరాను కొనసాగించడానికి పూర్తి ఏర్పాట్లు చేశాం. ఏవైనా సమస్యలు తలెత్తితే తక్షణమే స్పందించేందుకు మా క్విక్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి" అని ప్రతినిధి తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. మండపాలలో ఎలక్ట్రికల్ వైరింగ్ కోసం అధీకృత లైసెన్స్ ఉన్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సేవలను మాత్రమే వినియోగించుకోవాలని నిర్వాహకులను కోరింది. అంతేకాకుండా, నగరంలోని 167 విగ్రహ నిమజ్జన ప్రాంతాల్లో 2,958 ఫ్లడ్‌లైట్లతో వెలుగులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతినిధి వెల్లడించారు.

**నిర్వాహకులకు భద్రతా సూచనలు**

మండపాల వద్ద వైరింగ్ సిద్ధంగా ఉంచుకోవడం, మీటర్ క్యాబిన్‌లోకి అధీకృత సిబ్బందిని మాత్రమే అనుమతించడం, ప్రామాణిక వైర్లు, స్విచ్‌లు వాడటం, అత్యవసర పరిస్థితుల కోసం ఒకే ఐసోలేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వైర్లకు స్టాండర్డ్ ఇన్సులేషన్ టేప్ వాడాలని, మీటర్ క్యాబిన్ వద్ద ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ ఉంచాలని, సరైన ఎర్తింగ్ ఉండేలా చూసుకోవాలని తెలిపింది. అదేవిధంగా అనుమతి లేకుండా విద్యుత్ సరఫరాను పొడిగించడం, వైరింగ్‌లో అనవసరమైన జాయింట్లు వేయడం, లోడ్ కంటే ఎక్కువ విద్యుత్‌ను వాడటం వంటివి చేయవద్దని హెచ్చరించింది. మీటర్ క్యాబిన్ ప్రవేశానికి అడ్డంకులు సృష్టించడం, ఫ్లడ్‌లైట్లు, ఫ్యాన్లు, ఇన్సులేటెడ్ జాయింట్ల వద్దకు ప్రజలను అనుమతించడం వంటివి చేయరాదని స్పష్టం చేసింది.

క్యాబ్ డ్రైవర్ల సమ్మె

# శంషాబాద్‌లో ప్రయాణికుల అవస్థలు

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు. ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్లు ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీసులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆరోపించారు. ఈ అంశంపై ఆగస్టు 31న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలతో కీలక సమావేశం జరిగింది. జీవో నిబంధనల ప్రకారం ఛార్జీలు చెల్లించాలని అధికారులు ఆదేశించినప్పటికీ, సదరు కంపెనీలు వాటిని బేఖాతరు చేశాయని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. "మేము ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. మాకు దక్కాల్సిన చట్టబద్ధమైన ఛార్జీలతో పాటు వృత్తిపరమైన గౌరవం, సమానత్వం కావాలి" అని అన్నారు. ఈ సమస్యలపై సమగ్రంగా చర్చించి, లిఖితపూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.

# అమెరికాకు కౌంటర్ ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం

కొరియా ద్వీపకల్పంలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ కలిసి నిర్వహించిన "ఫ్రీడమ్ ఎడ్జ్" త్రైపాక్షిక సైనిక విన్యాసాలు ముగిసిన ఒక్క రోజుకే ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వారి విన్యాసాలను రెచ్చగొట్టే చర్యగా భావిస్తున్న ప్యోంగ్‌యాంగ్, తనదైన శైలిలో ప్రతిస్పందించింది. దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ (జేసీఎస్) తెలిపిన వివరాల ప్రకారం, శనివారం ఉదయం 5:20 గంటలకు ఉత్తర కొరియాలోని వోన్‌సాన్ ప్రాంతం నుంచి అనేక స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. అవి సుమారు 250 కిలోమీటర్లు ప్రయాణించి తూర్పు సముద్రంలో (సీ ఆఫ్ జపాన్) కూలిపోయాయి. ఈ ప్రయోగం తర్వాత దక్షిణ కొరియా సైన్యం అప్రమత్తమైంది. మరిన్ని ప్రయోగాలు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో, అమెరికా, జపాన్‌లతో సమాచారాన్ని పంచుకుంటూ పరిస్థితిని సమీక్షిస్తోంది. అయితే, ఈ క్షిపణుల వల్ల అమెరికా లేదా దాని మిత్రదేశాలకు తక్షణ ముప్పు ఏదీ లేదని యూఎస్ పసిఫిక్ కమాండ్ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లు కలిసి "ఫ్రీడమ్ ఎడ్జ్" పేరుతో వైమానిక, సముద్ర, సైబర్ డొమైన్‌లలో తమ సైనిక సామర్థ్యాలను పరీక్షించుకున్నాయి. ఈ విన్యాసాలను ఉత్తర కొరియా తీవ్రంగా వ్యతిరేకించింది. దీనికి బదులుగా "శక్తిమంతమైన ప్రతిచర్యలు" ఉంటాయని ఆ దేశ రక్షణ మంత్రి కిమ్ సాంగ్‌గి ముందే హెచ్చరించారు. ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలు చేయడం ఇది కొత్తేమీ కాదు. గత నెల ఆగస్టు 20న కూడా సుమారు 10 క్షిపణులను ప్రయోగించింది. ఈ ప్రయోగాలు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# ఎల్‌ఓసీ వద్ద ప్రశాంతత ఫేక్ న్యూస్‌పై ఆర్మీ స్పష్టత

జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయని, అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయమని సైన్యం ఆదేశించిందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని భారత సైన్యం తీవ్రంగా ఖండించింది. ఇదంతా నిరాధారమైన, తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇండియన్ ఆర్మీ అధికారిక ఫ్యాక్ట్‌చెక్ విభాగం నేడు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా జిల్లాల్లోని ప్రధాన సైనిక స్థావరాల సమీపంలో నివసించే వారిని ఇళ్లు ఖాళీ చేయాల్సిందిగా ఆర్మీ కోరినట్టుగా కొన్ని నివేదికలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ వార్తలకు, నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదుల కదలికలు పెరిగాయనడానికి సంబంధం ఉందంటూ `@KashmirIntel_` అనే ఎక్స్ ఖాతా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆర్మీ తెలిపింది. ఈ ఖాతా పాకిస్థాన్ ఆధారిత ప్రచార ఖాతా అని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే దీని లక్ష్యమని పేర్కొంది. "నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయనడం, అసాధారణ స్థాయిలో సైన్యం మోహరింపు జరుగుతోందనడం పూర్తిగా అవాస్తవం" అని ఆర్మీ అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రచార ఖాతా ఐరోపా కేంద్రంగా పనిచేస్తూ, కశ్మీర్‌లోని పరిస్థితులపై తప్పుడు కథనాలను సృష్టించడానికి ప్రయత్నిస్తోందని వివరించారు. గతంలోనూ పలుమార్లు ఈ ఖాతా నుంచి ఇలాంటి నకిలీ వార్తలు వ్యాప్తి అయ్యాయని గుర్తుచేశారు.

# ఢిల్లీ చేరిన జిన్‌పింగ్.. ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగు

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌కు చేరుకున్నారు. 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం న్యూఢిల్లీకి వచ్చిన ఆయన.. దాదాపు ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జిన్‌పింగ్‌తో పాటు చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు, పార్టీ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ కై కీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్‌కు వచ్చారు. ఈ విషయాన్ని చైనాలో భారత రాయబారి షూ ఫెయిహోంగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 2020లో గల్వాన్ ఘర్షణల తర్వాత భారత్‌చైనా సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని భారత్ పదేపదే స్పష్టం చేస్తోంది.

# స్టేడియం మనదే పరిశుభ్రత బాధ్యత మనదే

* కాళోజీ వాకర్స్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఆరోగ్య రక్షణే కాదు, పరిసరాల పరిశుభ్రత కూడా మన బాధ్యతే అనే సందేశాన్ని చాటుతూ కాళోజీ వాకర్స్ అసోసియేషన్ శనివారం మరోసారి ఆదర్శంగా నిలిచింది.స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం ఉదయం 7 గంటల నుండి గంటపాటు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని వాకర్స్ మిత్రుల సహకారంతో ఘనంగా చేపట్టారు. స్టేడియం నలువైపులా పేరుకుపోయిన విస్తరాకులు,వాటర్ బాటిల్స్,కూల్ డ్రింక్ బాటిల్స్,ఐస్ క్రీం కప్పులు,పేపర్ ప్లేట్లు, చాక్లెట్ పేపర్లను సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేశారు.అనంతరం మున్సిపల్ వాటర్ ట్యాంకర్ సహకారంతో స్టేడియంలోని వివిధ రకాల మొక్కలకు నీరు పోశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య సలహాదారు మైస శ్రీనివాస్ మాట్లాడుతూ కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ప్రతి రెండవ శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తుందని, ఆరోగ్య రక్షణతో పాటు పరిసరాల పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తామని అన్నారు.పంచాయతీలు, గేమ్స్ కోసం వచ్చే కొందరు వాటర్ బాటిల్స్, విస్తరాకులు ఇష్టారీతిగా పారవేయడం సరైన పద్ధతేనా?ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్,పెద్ది వెంకన్న,శ్రీహరి, వెంకన్న,మహేందర్ రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బిక్షం,రాంబాబు, రాజన్న,దేవేందర్ రెడ్డి, రామకృష్ణరావు, శ్రీనివాస్, ఎంఎస్ రెడ్డి, రవీందర్, లక్ష్మీనారాయణ, ఐలేష్,ఉపేందర్, మల్లయ్య,దామోదర్ రెడ్డి, బి. రాజు, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, దామోదర్, రామకృష్ణ,తోలం వెంకటేశ్వర్లు, పగడయ్య, నాగేశ్వరరావు, నాగరాజు, రాధాకృష్ణ, నేరెళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులనే పూజించాలి

* వై ఆర్ పీ ఫౌండేషన్ చైర్మన్ తనయుడు ఎలిశాల హేమచంద్ర




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలు పర్యావరణ పరిరక్షణకు పాటు పడేలా మట్టి గణపతులనే పూజించాలని వై ఆర్ పీ ఫౌండేషన్ చైర్మన్ ఎలిశాల రవిప్రసాద్ తనయుడు ఎలిశాల హేమచంద్ర పిలుపునిచ్చారు. వై ఆర్ పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలో ని పలు ప్రధాన కూడళ్లలో నిర్వహించిన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఆయన ప్రారంభించి మాట్లాడారు పౌరునిగా పర్యావరణ ప్రేమికుడిగా తన వంతు బాధ్యతగా గత 9 సంవత్సరాల నుంచి నల్గొండ తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భరత్, అభినవ్ రెడ్డి, వై ఆర్ పి ఫౌండేషన్ ఆర్గనైజర్ యామ దయాకర్ , 48వ డివిజన్ కార్పొరేటర్ యామ కవిత బమ్మపాల గిరి బాబు వెంకట్ శివ గణేష్ సురేష్ శివ సంతోష్ విజయ్ మిర్యాల శ్రీను , ప్రవీణ్ కర్నాటి లక్ష్మి జీనుగు జ్యోతి, రజిత, కుమారి, నవనీతా, విజయ పలువురు పాల్గొన్నారు.

## గోలి ప్రభాకర్ ను సన్మానించినఎస్సీ మోర్చ



ప్రజాస్ఫూర్తి నల్లగొండ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వికలాంగుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ గా ఇటీవల నియామకం కాబడిన గోలి ప్రభాకర్ ని శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శాలువా కప్పి పూలమాల వేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు బాకీ నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి చినేని జాని, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిండి పాపి రెడ్డి, మండల ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకన్న, నేరటి వెంకన్న బోడ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## డాలర్ పెత్తనానికి బ్రేక్ బ్రిక్స్ బాటలో కొత్త ప్రపంచం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ ఆధిపత్యానికి కేంద్రంగా ఉన్న జీ7 కూటమికి బ్రిక్స్ చెక్ పెడుతోందా? అనే చర్చ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు.న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ మెగా సమావేశాల నిర్వహణే భారత శక్తికి నిదర్శనమా? అని ఆయన ప్రశ్నించారు. జీ7 ను వెనక్కి నెట్టి, ప్రపంచ జనాభా, ఆర్థికాభివృద్ధిలో కీలక వాటా సాధించిన ఘనత బ్రిక్స్ దేనా? అని పేర్కొన్నారు.

## ఘనంగా జల్సాఏమీలాద్ ఉన్ నబీ



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలో ఇస్లాంపూర్ కాలనీలో ప్రవక్త హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినాన్ని పురస్కరించుకుని జల్సాఏమీలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొహమ్మద్ ఖాజా (డీఎక్స్ ఖాజా) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మత పెద్దలు, ముస్లిం సోదరులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుజూర్ ఖితబ్ఏజామా షహ్‌జాదే గౌసెఅజం పీర్ సయ్యద్ అలె ముస్తఫా ఖాద్రి అల్ జిలాని అలీ పాషా ఖాద్రి సర్కార్ సయ్యద్ ఆలె అహ్మద్ ఖాద్రి అల్ జిలాని హాసని పీర్ సాహెబ్ హాజరై ప్రసంగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను నిర్వాహకులు మొహమ్మద్ ఖాజా, తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ఇమామ్‌లు, షాద్‌నగర్ మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ గౌస్ జానీ, ముస్లిం సోదరులు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## కోతుల బెడద నుంచి ప్రజలకు, రైతులకు ఉపశమనం కల్పించే దిశగా పటిష్ట చర్యలు

* మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: కోతుల బెడద నుంచి ప్రజలకు, రైతులకు ఉపశమనం కల్పించే దిశగా మున్సిపల్ కమిషనర్ లు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుండి నర్సాపూర్, తూప్రాన్ మెదక్ మున్సిపల్ కమిషనర్ లతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. కోతుల బెడద నివారణకు గత సమావేశంలో చేర్పించిన అంశాలపై తీసుకున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.మెదక్ లో సుమారు 3,000 వేల కోతులు, అలాగే నర్సాపూర్లో 2వేల కోతులు, తూప్రాన్ లో 1000, రామాయంపేట మున్సిపాలిటీలో 500 కోతులు ఉన్నాయని, మున్సిపల్ కమిషనర్ నివేదికలు తయారు చేసినట్లు వివరించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలో చేపట్టి కోతులను పట్టి నిర్మల్ జిల్లాకు తరలించి ఆపరేషన్ అనంతరం ఆ జిల్లాలోనే వదిలి వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నిర్మూలన ప్రజలకు రైతులకు ఉపశమనం కలుగుతుందని ఈ సందర్భంగా వెల్లడించారు. కోతుల బెడద నియంత్రణను ఒక ఉద్యమంలా చేపట్టి దశలవారీగా ముందుకు సాగితే జిల్లాలో సమస్యను గణనీయంగా నియంత్రించవచ్చని అన్నారు. ఇందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని పేర్కొన్నారు. రైతులు, ప్రజలకు కోతుల బెడద నుంచి ఉపశమనం కల్పించి మెదక్ జిల్లాను కోతుల నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీ ఎఫ్ ఓ జోజి, డిపిఓ యాదయ్య,మున్సిపల్ కమిషనర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి.. కుక్కడపు వెంకటేశ్వర్లు



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : బీజేపీపై ఇతర రాజకీయ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని, రాబోయే ఎన్నికల నాటికి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించడంతో పాటు పార్టీని బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, కిసాన్, మైనార్టీ, మహిళా మోర్చా, బీజేవైఎం తదితర మోర్చాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాయినిగూడెంలో బీజేపీ జెండా ధ్వంసం చేసిన ఘటనపై ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్‌తో చర్చించి కేసు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎడవల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు జనిగల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ అనంతు గురువయ్యగౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సోమయ్యగౌడ్, సుందరి రమేష్, కాంపాటి రాజు, షేక్ మీరా, నర్సింగ్ నాగసైదులు, రావుల ఆంజనేయులుగౌడ్, నర్సింగ్ వినయ్, బొల్లేపల్లి శ్రీనివాస్‌గౌడ్, గుగులోతు రాజు, అశోక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాదాలకు సామరస్య పరిష్కారం లోక్ అదాలత్ తోనే సాధ్యం



మహబూబాబాద్ ప్రజాస్ఫూర్తి: జిల్లా న్యాయస్థాన సముదాయంలో 3వ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై,లోక్ అదాలత్ విశిష్టతను వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి స్వాతి మురారి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై ప్రజలకున్న భారాన్ని తగ్గించడం,కేసులను త్వరితగతిన పరస్పర అంగీకారంతో పరిష్కరించడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు.లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా, ఇరుపక్షాలు స్వయంగా నిబంధనలు, షరతులు రాసుకుని వివాదాన్ని పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ బెంచీల ఏర్పాటుతో పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించే దిశగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.అనంతరం సంస్థ కార్యదర్శి స్వాతి మురారి మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న సివిల్, క్రిమినల్,బ్యాంకు రికవరీ,మోటార్ వెహికల్ యాక్సిడెంట్ క్లెయిమ్స్, కుటుంబ తగాదాలు వంటి కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శాలిని షాకెల్లి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరవపల్లి కృష్ణ తేజ,డీఎస్పీ తిరుపతిరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణ, ప్రభుత్వ న్యాయవాది టి. నగేష్ కుమార్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. వెంకటయ్య, న్యాయవాదులు, కక్షిదారులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య రక్షణే పోషణ మాసం లక్ష్యం

* పోకల వెంకమ్మ అంగన్వాడీ టీచర్



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : ఆహారం విషయంలో మనం తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా జీవిత ఆసాంతం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని అంగన్వాడి టీచర్ పోకల వెంకమ్మ అన్నారు. గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామంలో పోషణ మాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం లో ఇంటింటి ప్రచారం కూడా నిర్వహించారు. గర్భవతులు బాలింతలు ఆహారం తీసుకోవడంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ,స్థూలకాయ నివారణ, చక్కెర,నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ పోకల వెంకమ్మ, జంగము అనిత, సత్యవతి, గోవిందమ్మ,ఈద మమత, రెబ్బా మల్లీశ్వరి, జానపటి కామేశ్వరి,సురభి త్రివేణి,షేకు ఇమాంబి,ఈద అక్కమ్మ, షేక్ సైదాబీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచం గర్వించదగిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి

* సిపిఎం కేంద్ర కమిటీ నాయకులు తమ్మినేని




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం ఎన్.కె నగర్ నందు గల కమ్మ కళ్యాణ మండపంలో సిపిఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు . ముందుగా ఆయన చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం ,బండారు రవికుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, కనకయ్య రమేష్ , పుల్లయ్య, సత్యనారాయణ , జ్యోతి నర్సారెడ్డి , పుల్లయ్య బ్రహ్మచారి , బాలరాజు , శ్రీనివాస్, ధర్మ, నబి , రవికుమార్, స్వామి, వెంకన్న ,రమేష్ ,పద్మ , చిలకమ్మ, వెంకటేశ్వర్లు , రమేష్ ,సాంబశివ ,నరేష్ తదితరులు పాల్గొన్నారు .

## హైదర్‌నగర్‌లో ఘనంగా బ్యాడ్మింటన్ పోటీలు

* హోరాహోరీ పోరులో చందు నరహరి విజేత



హైదర్‌నగర్ ప్రజాస్ఫూర్తి : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదర్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఎల్వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక క్రీడాకారులు, అకాడమీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు విభాగాల్లో జరిగిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ఫైనల్ పోరు నువ్వానేనా అన్నట్లుగా హోరాహోరీగా సాగింది. ఆఖరి పాయింట్ వరకు ఉత్కంఠ నెలకొనగా.. చందు నరహరి అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారు. నిర్వాహకులు ఆయనకు ప్రథమ బహుమతితో పాటు జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. పండుగల సందర్భంగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా సమాజంలో సోదరభావం మరింత బలపడుతుందన్నారు. కార్యక్రమంలో క్రీడా ప్రోత్సాహకులు విష్ణు యాదవ్, డాక్టర్ సురేందర్, అజయ్ చింతల, రామ్, నవీన్, ప్రవీణ్, ఆర్కే, సుధాకర్, సాయి, నరేష్, రమేష్, నాగరాజు యాదవ్, సురేంద్ర, దరియా, కిషోర్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొని విజేతకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఇంటిలో మట్టి విగ్రహాలతో పూజలు చేయాలని శ్రీరామ్ సేవా ట్రస్ట్ చైర్మన్ తోట శ్యాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక అలంకార్ సెంటర్ లోని బియ్యం దుకాణాల వద్ద శ్రీరామ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత బంకమట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు కూడా తమ ఇంట్లో మట్టి వినాయకుడిని పూజలు చేసి స్థానికంగా ఉన్న చెరువుల్లో కాలువలలో నిమజ్జనం చేయాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నిమజ్జనం చేస్తే నీళ్లు కలుషితమైపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ సేవా ట్రస్ట్ సభ్యులు మహంకాళి రమేష్, వీళ్లపాటి రమేష్, పోలా నరేష్, రేపాల యాదగిరి, ఓరుగంటి అనిల్, యామా లక్ష్మీనారాయణ, నడిపల్లి ప్రవీణ్ ,వందనపు రజనీకాంత్, మురారిశెట్టి శ్రీధర్, బూర్లె మధుసూదన్, పోతుగంటి మనోహర్, గుండా శంకర్ , పాలవరపు రంగనాథ్, కక్కిరేణి వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# క్రాంతి కాలనీలో నూతన వినాయక మండపం ప్రారంభం



బోడుప్పల్, ప్రజాస్ఫూర్తి: మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్ల డివిజన్ క్రాంతి కాలనీ రోడ్ నంబర్-1లో శ్రీ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన వినాయక మండపాన్ని బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ శనివారం ఘనంగా ప్రారంభించారు. మండప నిర్మాణానికి ఆయన తన సొంత నిధులను సమకూర్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుర్రి శివశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలను కాలనీవాసులందరూ ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలో వినాయక మండపాన్ని నిర్మించి అందించిన కొత్త స్రవంతి కిషోర్ గౌడ్‌కు కాలనీవాసులు, శ్రీ గణేష్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపియన్ డే కార్యక్రమంలో భాగంగా మెదక్ అదనపు కలెక్టర్ శనివారం కుల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామం, పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో మ్యాపింగ్ కాని కేసులు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులను అధికారులు, సిబ్బందితో కలిసి ధృవీకరించారు. ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక ఓటరు కంపియన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివాదాలకు సామరస్య పరిష్కారం లోక్ అదాలత్ తోనే సాధ్యం



మహబూబాబాద్ ప్రజాస్ఫూర్తి: జిల్లా న్యాయస్థాన సముదాయంలో 3వ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై,లోక్ అదాలత్ విశిష్టతను వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి స్వాతి మురారి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై ప్రజలకున్న భారాన్ని తగ్గించడం,కేసులను త్వరితగతిన పరస్పర అంగీకారంతో పరిష్కరించడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు.లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా, ఇరుపక్షాలు స్వయంగా నిబంధనలు, షరతులు రాసుకుని వివాదాన్ని పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ బెంచీల ఏర్పాటుతో పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించే దిశగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.అనంతరం సంస్థ కార్యదర్శి స్వాతి మురారి మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న సివిల్, క్రిమినల్,బ్యాంకు రికవరీ,మోటార్ వెహికల్ యాక్సిడెంట్ క్లెయిమ్స్,కుటుంబ తగాదాలు వంటి కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శాలిని షాకెల్లి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరవపల్లి కృష్ణ తేజ,డీఎస్పీ తిరుపతిరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణ,ప్రభుత్వ న్యాయవాది టి. నగేష్‌కుమార్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. వెంకటయ్య,న్యాయవాదులు,కక్షిదారులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అక్రమ మట్టి తరలింపు.. 5 వాహనాలు పట్టివేత

* **హిటాచీ,నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు**

బచ్చన్నపేట/జనగామ, ప్రజాస్ఫూర్తి : మండలంలోని ఆలింపూర్ గ్రామ శివా రులో అర్ధరాత్రి అక్రమంగా మట్టి తరలి స్తున్న వాహనాలను బచ్చన్నపేట పోలీ సులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమ తులు లేకుండా భారీగా మట్టి తవ్వి త రలిస్తున్నారన్న సమాచారంతో పోలీసు లు రాత్రి సుమారు ఒంటిగంట సమ యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న ఒక హిటాచీ, నాలుగు టిప్పర్ వాహనాలను గుర్తించి స్వాధీనం చేసు కున్నారు. అనంతరం వాహనాలను బ చ్చన్నపేట ఎంఆర్‌ఓకు లేఖ ద్వారా అ ప్పగించినట్లు పోలీసులు తెలిపారు.



# ఇంటికి తాళం పగులగొట్టి చోరీ

* **బంగారు కమ్మలు, వెండి పట్టీలు, రూ.20 వేల నగదు అపహరణ**

జనగామ, ప్రజాస్ఫూర్తి : రాజీవ్‌నగర్ కాలనీలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన కుటుంబం తిరిగి వచ్చే సరికి దొం గతనం జరిగిన ఘటన వెలుగుచూసిం ది. కాలనీకి చెందిన చింతల మహేష్ తన భార్యతో కలిసి బుధవారం ఇంటికి తాళం వేసి హనుమకొండలోని తమ బిడ్డను చూసేందుకు వెళ్లారు. గురువా రం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో అను మానం వచ్చి లోపలికి వెళ్లి పరిశీలించా రు. బెడ్రూంలోని బీరువాను కూడా పగులగొట్టి, అందులో ఉన్న ఒక జత బంగారు కమ్మలు, 10 తులాల వెండి కాళ్ల పట్టీలు, రూ.20 వేల నగదును గుర్తుతెలియని దొంగలు అపహరించిన ట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు

# వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి

* **బిజెపి జిల్లా అధ్యక్షుడు వోల్డాస్ రాధామల్లేశం గౌడ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా బిజెపి కార్యాలయంలో 'సేవా సంకల్ప అభియాన్' వర్క్‌షాప్ జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అధ్యక్షతన, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణీత ముఖ్య అతిథిగా 'సేవా సంకల్ప అభియాన్' జిల్లా స్థాయి వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 17 (ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు మరియు తెలంగాణ విమోచన దినోత్సవం) నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమాలు కొనసాగుతాయి. బూత్ స్థాయిలో రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సంఘసని సురేష్, శ్రీనివాస్, రాష్ట్ర ఓబీసీ నాయకులు రమేష్ గౌడ్, రాగి రాములు, మోర్చా నాయకులు వడ్ల జనార్ధన్, శ్రీనివాస్, మల్లిక, బాలరాజ్, సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్, నల్లాల విజయ్, రాజేందర్, శంకర్ గౌడ్, మెదక్ కౌన్సిలర్లు రాజమణి, అఖిల భరత్, వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి

* **జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ హామీ ఇచ్చారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ పోలాల బస్తిలో వెలసిన మల్లన్న స్వామి ఆలయం రహదారి సీసీ రోడ్డు పనులకు శనివారం మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం దాదాపు ఆరు లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్, బిజెపి నాయకులు పున్నారెడ్డి, స్థానిక నాయకులు దేపే కృష్ణ, భాస్కర్ రెడ్డి, రాములు, రాజు, భాస్కర్, ప్రేమ్ చందర్ రెడ్డి, వేణుగోపాల్, దేవేందర్, అర్జున్, డిజె సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ జిల్లా నాయకుని జన్మదిన వేడుకలు



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో భారత రాష్ట్ర సమితి మండల పార్టీ అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో కలిసి జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి , జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సన్నిల వెంకటేశం, ఉప సర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మి రాజు,మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, మాజీ సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, యూత్ నాయకులు తాటికొండ సందీప్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు బందారుపల్లి చంద్రం, కాశ బోయిన రాజు ,తాళ్లపల్లి అరవింద్, జిల్లాల సదయ్య ,బెజ్జంకి సంపత్ కుమార్, చిట్యాల సంపత్ కుమార్ ,బెజ్జంకి శంకర్, నిలుగొండ దశరథం ,వేల్పుల లింగమూర్తి ,పోటు సుధీర్ రెడ్డి, కాశరాజు ,ఆంజనేయులు, బి ఆర్ ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు ,తదితరులు ,పాల్గొన్నారు..

# గణేష్ ఉత్సవాల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

* **ఉల్లంఘిస్తే కఠిన చర్యలు... రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణు**



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి: గణేష్ ఉత్సవాలకు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణు కోరారు... శనివారం సాయంత్రం రూరల్ కార్యాలయంలో నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ... ప్రజలందరూ గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో సోదర భావంతో.. శాంతియుత ప్రశాంతత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు గణేష్ మండపాల నిర్వాహకులు మండపం ఏర్పాటు చేయడానికి ముందుగానే పోలీసులకు సమాచారం అందించడంతోపాటు పోలీస్ శాఖ రూపొందించిన ఆన్లైన్ పోస్టర్ను మండపానికి సంబంధించిన వాళ్ళు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు తగిన భద్రత చర్యలు చేపట్టాలని 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని కోరారు ప్రజలకు అనుమానిక వ్యక్తులు ఎవరైనా కల్పిస్తే పోలీసుల సమాచారం అందించాలని కోరారు ఈ సమావేశంలో రఘునాథపల్లి చిల్పూర్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లు నరేష్ యాదవ్... నవీన్ కుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

* **జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



భూపాలపల్లి, ప్రజా స్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ఉత్సవ నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో ఇంటిమేషన్ ఫారం అప్‌లోడ్ చేయడంతో పాటు స్థల యజమాని నుంచి ఎన్‌ఓసి పొందాలని సూచించారు. ట్రాఫిక్‌కు, ప్రజా శాంతిభద్రతలకు ఇబ్బంది కలగని ప్రదేశాల్లోనే మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. అనధికారిక విద్యుత్ కనెక్షన్లు వినియోగించరాదని, అధికారిక విద్యుత్ కనెక్షన్ పొందాలని స్పష్టం చేశారు. మండపాల్లో రెండు బాక్స్ టైప్ స్పీకర్లకే పరిమితం కావాలని, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగం నిషేధమన్నారు. పోలీస్ క్లియరెన్స్‌లో పేర్కొన్న నిమజ్జన మార్గం, సమయాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి మండపం వద్ద సీసీటీవీ , వీడియో కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలని, అసభ్యకర కార్యక్రమాలకు తావివ్వకుండా భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఓటిపి, పిన్ , పాస్‌వర్డ్‌ల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉత్సవాలను ప్రశాంతంగా, సామరస్యపూర్వకంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, ప్రజలు, శాంతి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

* **రామన్నపేట సీఐ రవి**



వలిగొండ , ప్రజాస్ఫూర్తి : గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని రామన్నపేట సిఐ రవి కోరారు శనివారం వలిగొండలో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తో కలిసి గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు ఇంకా డీజే లకు ఎలాంటి అనుమతులు లేవని ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- **ఇ.ఎల్.వి భాస్కర్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఈ నెల 19న లక్కారం వి.వి.ఆర్ గార్డెన్ లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ మండల పరిధిలోని లక్కారంలోని వివిఆర్ గార్డెన్స్ లో ఇఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న "మెగా జాబ్ మేళా" నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు 70కి పైగా ప్రముఖ కంపెనీలు హాజరై అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మసీ వంటి ఏ విద్యార్హత కలిగిన యువత హాజరు కావాలని కోరారు. అభ్యర్థులకు ప్రవేశం పూర్తిగా ఉచితమని, ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95508 43338నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ నాయకులను కలిసిన ఎన్ఎస్ యుఐ ప్రెసిడెంట్



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి నియమితులైన సందర్భంగా అజ్మీర సురేష్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి సభ్యులు జెబి శౌరి ,జిల్లా సెక్రటరీ ఎం.డి. గౌస్ మొహినుద్దీన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలుపుతూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు . అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం , సమర్థవంతంగా పనిచేస్తూ, విద్యార్థుల పరిరక్షణకు కృషి చెయ్యాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాము, ఉర్సు శివ, షేక్ హమీద్, షేక్ అజహర్ , శ్రీధర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు..

# ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచీలు

**– నల్గొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి**




ప్రజాస్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచీ లాంటి వారని, వారి దిశా నిర్దేశంలో విద్యార్థులు తమ ప్రతిభకు పదునుపెట్టి ఉన్నతులుగా ఎదుగుతారని నల్గొండ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రమాదేవి అన్నారు. యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జె.బి. బాలు ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారికి అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ముఖ్య అతిధులు డిప్యూటీ కలెక్టర్ రమాదేవి, భద్రాచలం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్, టీజీఓ జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య చేతులమీదుగా అవార్డులు అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య ,జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రంగా ప్రసాద్ ,యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు బి. వీరు నాయక్, హనుమాన్ జిమ్ కమలాకర్, ఇంగ్లీష్ బాలు, రాజేష్, రంగ, సుభాని, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మన్ననలు పొందుతున్న పిల్లుట్ల రఘు సేవలు

* నాలుగోసారి ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ అభినందనీయం
* బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణా నాయక




గరిడేపల్లి, ప్రజాస్పూర్తి: ప్రజా సేవే లక్ష్యంగా, పండుగలు సాంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు సేవలు అభినందనీయమని బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణా నాయక్ అన్నారు. మండల కేంద్రమైన గరిడేపల్లిలో పిల్లుట్ల రఘు నాలుగోసారి అందిస్తున్న ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ టోకెన్లను పంపిణీ ఆయన పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వంటి ఆధ్యాత్మిక, సాంప్రదాయ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనే మంచి ఉద్దేశంతో గత నాలుగు సంవత్సరాలుగా ఉచిత వినాయక విగ్రహాలను అందించడం పిల్లుట్ల రఘు కు ప్రజల పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనమని పేర్కొన్నారు. నాలుగో ఏడాది కూడా ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించడం గొప్ప విషయమని, ఇలాంటి సామాజిక, సేవా కార్యక్రమాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వీరం రెడ్డి, సెంబిరెడ్డి, సర్పంచులు బోల్లెపల్లి రామనాథం సుధా నాగరాజు, మచ్చ మురళి, సందీప్ నాయక్, నాగయ్య సుందరయ్య, నరేందర్ నాయక్, టిఆర్ఎస్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల మెడిసిన్ చదువుకు ఆర్థిక సహాయం



ప్రజాస్పూర్తి, సూర్యాపేట:సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత 30 సంవత్సరాలుగా నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ ఎంతోమందికి ప్రాణదానం చేసిన విజయ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ లు మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు తమ సామాజిక బాధ్యతను మరోసారి చాటుకున్నారు. ఇటీవల పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు భీపంగ యశ్వంత్ నీట్ లో 1301 ర్యాంకు సాధించి ఉస్మానియాలో, మామిడి ఇందు నీట్ లో 10150 ర్యాంకుతో గాంధీ హాస్పిటల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించడం పట్ల అభినందిస్తూ ఒక్కొక్కరికి రూ :25 వేల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు మొదటి సంవత్సరానికి ఉపయోగపడే పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు ఉన్నత వైద్య విద్యలో సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. వారు ఇరువురు పేదరికంలో ఉన్నారని చదువుకునేందుకు పేదరికం అడ్డుకాకూడదని ఆలోచనతో తాము ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. సమాజం కూడా స్పందించి వారి వైద్యవిద్యకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరాలలో కూడా ఇరువురి విద్యార్థులకు కావలసిన సహాయ సహకారాలను తమ ద్వారా అందజేస్తామన్నారు. డాక్టర్ దంపతుల దాతృత్వం పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకొని వైద్యవిద్యను విజయవంతంగా పూర్తి చేసి నిరుపేదలకు వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

# చిగురుమామిడి పీఏసీఎస్ చైర్మన్‌గా చిట్టుమల్ల రవీందర్ బాధ్యతలు స్వీకరణ



చిగురుమామిడి,ప్రజాస్పూర్తి: చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)నూతన చైర్మన్‌గా చిట్టుమల్ల రవీందర్ శనివారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అధికారులు ఆయనతో పాటు 12మంది నూతన డైరెక్టర్లతో అధికారికంగా ప్రమాణస్వీకారం చేయించారు.చైర్మన్ రవీందర్‌తోపాటు ప్రమాణస్వీకారం చేసిన వారిలో డైరెక్టర్లు చాడ మహిపాల్ రెడ్డి,పోటు మల్లారెడ్డి,చిట్యాల బాల్ రేడ్డి,పచ్చిమట్ల లక్ష్మి, కూతాటి తిరుపతి,శ్రీరామోజు రాజకుమార్,చింతపుల సాయన్న,కనగడ్ల శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, బెజ్జంకి భాగ్య, పిల్లి కొమురయ్య,బొమ్మగాని పరుశురాములు ఉన్నారు. ప్రమాణస్వీకార మహోత్సవం అనంతరం సింగిల్ విండో కార్యాలయంలో నూతన పాలకవర్గానికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్ హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు చింతపుల నరేందర్,అల్లెపు సంపత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు బడుకోలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్,గుళ్ళ రాజు,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,పూదరి వేణు,ఎనగందుల లక్ష్మణ్,మాచమల్ల రమణయ్య, బోయిని నరేష్,గట్టు ప్రశాంత్,సోషల్ మీడియా మండల కన్వీనర్ జిల్లెల రమేష్, పోతర్ల శివాంజనేయులు,గంగిపెల్లి సురేష్,ఎలగందుల శివకుమార్ తోపాటు పలువురు సహకార సంఘ ప్రతినిధులు,రైతులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో భాద్రపద మాసం మొదటి రోజు పూజలు



ప్రజాస్పూర్తి ,షాద్నగర్: షాద్నగర్ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో భాద్రపద మాసం మొదటి రోజు పురస్కరించుకొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ మాసంలో ఒంటి పూట భోజనం చేస్తే ధన సమృద్ధి ఆరోగ్యం ప్రాప్తిస్తాయి. ఉప్పు మరియు బెల్లం దానాలు కూడా ఈ మాసంలో విశేష ఫలితాన్ని ఇస్తాయి. శుద్ధ చవితి నాడు ఆదిదేవుడైన వినాయక ఆవిర్భావం జరిగిన ఈరోజు గణపతి పూజ ఉపవాసం వంటివి విశేష ఫలితాలు ఇస్తాయి. అన్ని మాసాలో కల్లా ఈ భాద్రపద మాసం విశేషంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ మాసంలో పితృతర్పణాలు మనకు దైవ సమానులైన తల్లిదండ్రులకు తర్పణాలు అర్పిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు,సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మలగారి సత్యనారాయణ, 12వ వార్డ్ కౌన్సిలర్ కళ్యాణ్ గారి దిలీప్ కుమార్, మాజీ కౌన్సిలర్ ఈగ వెంకట్రాంరెడ్డి, కానుగు అనంతయ్య,మాజీ కోఆప్షన్ నెంబర్ ఒగ్గు కిషోర్, షాద్నగర్ పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు గంధం ఆనంద్ కుమార్, ఆర్యవైశ్య నాయకులు యంసాని శ్రీనివాస్, అంతటి కోటి లింగం గౌడ్, ఆలయ మేనేజర్ రాజగోపాల్ ,అర్చకులు సంతోష్ కుమార్, రవి శర్మ,సునీల్, కిరణ్ శర్మ,గణేష్,శివ,మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాంచజన్య సంకల్ప సభ ను విజయవంతం చేద్దాం

* షాద్ నగర్ లో సంకల్ప సభ పోస్టర్ విడుదల



ప్రజాస్పూర్తి ,షాద్నగర్ : టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత నాయకత్వంలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని టీఆర్ఎస్ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీమల రమేష్ కురుమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం షాద్‌నగర్‌లో పాంచజన్య సంకల్ప సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పాంచజన్య సంకల్ప సభ ఇన్‌చార్జ్ రంజిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీమల రమేష్ మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఈ నెల 20న కొడంగల్ నియోజకవర్గం కోస్గి కాలేజ్ గ్రౌండ్ లో చేపడుతున్న పాంచజన్య సంకల్ప సభకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సభకు భారీగా తరలి రావాలి అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, పాంచజన్య సంకల్ప సభ ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రజలకు వివరించనున్నట్లు పాంచజన్య సంకల్ప సభ ఇన్‌చార్జ్ రంజిత్ కుమార్ పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ మహిళా అధ్యక్షురాలు ఎన్ ప్రవీణ, షాద్ నగర్ పట్టణ అధ్యక్షులు రంగన్న గౌడ్, ఫరక్ నగర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు అర్చన, యువజన అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, పార్టీ సలహాదారులు దివిటి వెంకటయ్య, నాయకులు సీమల వెంకటేష్, అప్పారావు మల్లేష్, మౌనిక, పార్టీ నాయకులు, మహిళ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ



ప్రజాస్పూర్తి , షాద్నగర్ : షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ప్రతి శనివారం దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి మరియు దేవాలయంలో నిర్మిస్తున్న అభివృద్ధి పనులకు దాతలు సహకరించాలని ఆయన కోరారు. అదేవిధంగా పట్టణానికి చెందిన సుప్ప నరసింహులు యాదమ్మ దంపతులు అన్నదానానికి 25 కేజీల బియ్యం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, ఎంసాని నరసింహులు, జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్, శ్రీశైలం యాదవ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, శంకర్ గౌడ్, లక్ష్మారెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, యాదగిరి, తులసి రామ్, రఘునందన్ రెడ్డి, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, నరహరి, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం




జనగామ, ప్రజాస్పూర్తి : తెలంగాణ రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 120 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పట్టణం లోని భ్రమరాంబ వేడుకల మందిరంలో అవార్డులు అంద జేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో వారి పాత్ర కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాలల నిర్వహణతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ట్రస్మా చైర్మన్ సూచించారు

# ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత



ప్రజాస్పూర్తి ,జన్నారం : జన్నారం మండలం ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిట్యాల భీమేష్ తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ తరపున ₹5,000 రూపాయలను ఆర్థిక సహాయం అందించి, ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఇలాంటి కష్ట సమయంలో కుటుంబానికి గల్ఫ్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు మగ్గిడి తిరుపతి, సభ్యులు చిట్యాల రాజు, చిట్యాల శేఖర్, గుమ్ముల లింగేశ్వర్, గుమ్ముల గంగన్న, సుందిల్ల రాజన్న, ఎర్రోళ్ల ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



ప్రజాస్పూర్తి, ఖమ్మం జిల్లా: ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం వెంకటాపాలెం గ్రామపంచాయతీ పరిధిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ సహకారంతో,భట్టి విక్రమార్క యువసేన అధ్యక్షుడు కిలారు అనిల్ కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన శిబిరంలో హైదరాబాద్ లక్డికాపూల్ లోని ట్రాపికల్ హాస్పిటల్ ఫోర్టిస్ హాస్పిటల్ వైద్య బృందం ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభం చేశారు. అనంతరం డాక్టర్ జహీరా మహమ్మద్ చారిటబుల్ ట్రస్ట్, ఐసిఎస్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం కొనసాగింది. ఈ శిబిరంలో బరువు, బీపీ చెకప్, జిఆర్బిఎస్, ఈసీజీ , 2డి ఎకో వంటి అన్ని రకాల పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన వారికి మరిన్ని పరీక్షలు కూడా ఉచితంగా అందజేసారు.ఈ మెగా శిబిరంలో కార్డియాలజీ, గైనకాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్స్, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, జనరల్ ఫిజీషియన్ విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య సేవలు, సలహాలు, సూచనలు అందించారు.గ్రామంలోని ప్రజలు,చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ మెంబర్ గజ్జల వెంకన్న, బొమ్మిడి శ్రీనివాస్, కిలారు వెంకటరమణ, వై.మురళీకృష్ణ,తగరం నాగరాజు, తగరం రాంబాబు, శ్రీకాంత్, హర్ష, దుర్గ, నాగరాజు, భరత్ తివారి తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణ



ప్రజాస్పూర్తి, సూర్యాపేట:భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం మరింత పెరగనుందని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ రావు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో గాంధీ బొమ్మ విగ్రహం సమీపంలో జె.వి.ఆర్ ఈవి మొబిలిటీ బైక్స్, ఆటో షోరూమ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఎలక్ట్రిక్ బైకుల కొనుగోలు కు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. వినియోగంతో ఇంధన ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జె వి ఆర్, రామసాని శ్రీనివాస్ నాయుడు, లక్ష్మి రామకృష్ణారెడ్డి, దంతాల రాంబాబు, నిర్వాహకులు సింగశెట్టి నీరజ ప్రసాద్ నాయుడు , వెంకటేశ్వర్లు, మౌనిక, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంచిగ చదవాలి, చక్కగా ఎదగాలి!

**చదువు జదువకున్న సౌఖ్యంబులును లేవు.**
**చదువు జదివెనేని సరసుడగును.**
**చదువు మర్మమెరిగి చదువగ చూడుము**
**విశ్వదాభిరామ! వినురవేమ.**



చదువు (విద్య) లేనివారికి సౌఖ్యం లభించదు. చదువుకున్నవాడే సరసుడు చదువుకోవాలనే అభిలాష గలవాడు విద్యలలోని సారాన్ని, మర్మాన్ని గ్రహించడానికి చదవాలి గానీ వధా పఠనము వలన ప్రయోజనం లేదు. చదువు (విద్య) కు గల గొప్పతనాన్ని, పతనాన్ని ఆనాడే యోగి వేమన స్పష్టంగా, సూటిగ వివరించారు. అయినా చదువు పట్ల నిర్లక్ష్యం ఇంకా గమనించబడుతూనే ఉంది. చదువుకున్న వ్యక్తి చదువుకున్న సమాజం ఖచ్చితంగా అభివద్ధిని సాధిస్తుంది. అందుకే ఇంకా చదవాలి, ఎదగాలి, అభివద్ధి సాధించాలి. వజ్రాన్ని వివిధ కోణాల నుంచి చూస్తే వివిధ రంగుల్లో జిగేల్ మనిపిస్తుంది. అమితంగా ఆకర్షిస్తుంది కూడా. అలాగే 'విద్య' కూడా వజ్రం లాంటిదే. విద్యకు అనేక అర్థాలున్నాయి. విద్యను నిర్వచించడం అనేది అంత ఈజీ కాదు. విద్య అనే పదం 'విద్' అనే సంస్కత మూలం నుండి గ్రహించబడింది. ఒక్క వాక్యంలో చెప్పాలంటే... తెలుసుకోవడం, అంటే తెలియని విషయాల్ని తెలుసుకోవడమే విద్య అని అర్థం చేసుకోవాలి. విద్య ఉన్న వ్యవస్థ ఖచ్చితంగా రాణిస్తుంది. ఈ ప్రపంచంలో దేనికైనా మరోటి సాటిగ ఏదైనా ఉండవచ్చునేమో కాని విద్యకు సాటి మరోటి లేదు. విద్యకు విద్యే సాటి మరోది లేనేలేదు. ఉండదు కూడా! విద్య ద్వారానే అజ్ఞానమనే చీకటి పారద్రోలబడుతూ జ్ఞానమనే వెలుగు ప్రసరించబడుతుంది. దేనినైనా దొంగలించవచ్చును గాని విద్య ధనాన్ని ఎవరూ దొంగలించలేరు. ఒకసారి గమనించండి. 'చక్కటి విద్య వినయాన్ని ఇస్తుంది. వినియం వలన యోగ్యత గమనించబడుతుంది. యోగ్యత వలన ధనం లభిస్తుంది. ధనం వలన ధర్మం లభిస్తుంది (లభించాలి). ధర్మం వలన కీర్తి లభిస్తుంది.' అదే ధన్యత. ఎప్పుడైనా, ఇక్కడైనా, ఎక్కడైనా, పరదేశంలోనైనా బంధువుగా మన వెన్నంటి ఉండేదే విద్య. విద్య ఒక వ్యక్తిని సమాజంలో గౌరవించబడేలా చేస్తూ ప్రత్యేకతనిస్తుంది. అందుకే విద్యావంతులే స్వేచ్ఛవంతులుగా చెప్పబడింది. ఈ మేరకు విద్యకే మొదటి ప్రాధాన్యతను ఇవ్వడం సముచితం, శ్రేయస్కరం, ఉపయుక్తం కూడా! ఇందులో ఎలాంటి సందేహాలు అనవసరం. గమనించండి.

1. విద్య వ్యక్తిలోని అంతర్గత సామర్థ్యలను, నైపుణ్యాలను వెలికితెస్తుంది. ఫలితంగా స్వేచ్ఛగా జీవించే అవకాశాన్ని కలిగిస్తుంది.
2. విద్య ద్వారా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంటాయి.
3. విద్య వ్యక్తులను ఆర్ద్రత కలిగిన మనుషులుగా తయారు చేస్తుంది. విలువల ఆధారిత విద్య వ్యక్తుల్లో ఆర్ద్రతను, దయాగుణాన్ని, సజనాత్మకతను పెంపొందిస్తుంది.
4. విద్య పేదరికం నుండి అభివద్ధి పథం వైపు తీసుకెళ్తుంది. ఒకప్పుడు పేదరికంతో అల్లాడిన వ్యవస్థలు, దేశాలు నేడు అభివద్ధి సాధించాయంటే కేవలం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే అనేది సత్యం5. చక్కటి విద్య వలన వ్యక్తిత్వ వికాసం గమనించబడుతుంది. చక్కటి వైఖరులతో మంచి మూర్తిమత్వం గమనించబడుతుంది.
6. విద్యావంతులైన వారు ఆర్థికంగా, సామాజికంగా, నైతికంగా, మానసికంగా ముందడుగు వేస్తారు.
7. విద్య జీవితంలో అనేక విధాలైన అస్థిరత్వాన్ని తొలగిస్తుంది. అర్థవంతమైన జీవితాలను కలిగి ఉండేలా అనువైన వాతావరణాన్ని కల్పిస్తుంది.
8. సహనం, సర్దుబాటు, సామరస్యం లాంటి ఉత్తమ ధోరణులను విద్య పెంపొందిస్తుంది.
9. భ్రమలకూ, వాస్తవాలకు మధ్య తేడాలు గమనించబడేలా చేస్తూ అసలు వాస్తవాలను వివేచనతో పరిశీలించగల శక్తిని కేవలం విద్యే సమకూర్చుతుంది.
10. అణగారిన వారికి గొప్ప ఆయుధం విద్యే. విద్య ద్వారానే సకలం సమకూర్చబడుతూ ప్రయోజకత్వం గమనించబడుతుంది. ఎక్కడైతే విద్య చేరుతుందో అక్కడ జ్ఞానం ఒక శక్తిగా గమనించబడుతుంది. జ్ఞానం కలవారిని సమాజం గౌరవిస్తుంది. ఒక విద్యావంతుడిని మనం గౌరవిస్తున్నామంటే మనమిచ్చే గౌరవం అతని విద్యకే గాని అతనికి కాదని గమనించాలి. అందుకే, అన్నింటిలోకెల్లా విద్యకే మొదటి ప్రాధాన్యత ఇవ్వబడడం సముచితం. దేనిపైనా పెట్టే పెట్టుబడి ఎంతవరకు తిరిగి వస్తుందో చెప్పలేము, ఊహించలేం కాని విద్యపై పెట్టే పెట్టుబడి ఖచ్చితంగా రెట్టింపులో చక్కటి ఫలాలనిస్తుంది.

విద్య అనే వృక్షపు వేర్లు చేదుగా ఉన్నా దాని ఫలాలు మాత్రం అతి మధురంగా ఉంటాయని ఏనాడో స్పష్టంగా చెప్పబడింది. అందుకే, లక్షణంగా, చదువుకుంటూ ఉన్నతంగా ఎదగాలి. చదువు లేని వ్యవస్థలు ఎక్కడో గాలిలో ఉంటే చదువుకున్న వ్యవస్థలు కరెక్టు గాడిలో ఉంటాయి. 100% అభివద్ధి సాధిస్తాయి.

**డాక్టర్ ఎం.ప్రభుదయాల్**
**మాజీ సెనెట్ మెంబర్, కాకతీయ యూనివర్సిటీ,**
**పూర్వ ఎంఈఓ, కొత్తగూడెం.**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

# తెలంగాణలో ఆగని వానలు.. మరో వారం పాటు వర్ష సూచన

- **తెలంగాణలో మరో వారం పాటు వర్షా లు కొనసాగింపు**
- **రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన**
- **ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కుండపోత వానల అంచనా**
- **సీజనల్ వ్యాధులపై ప్రజారోగ్య శాఖ ప్రత్యేక హెచ్చరికలు జారీ**
- **హైదరాబాద్‌లోనూ మోస్తరు వర్షా లు కురిసే అవకాశం**



తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

**ఆరోగ్య శాఖ హెచ్చరిక**

వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## అసోసియేషన్ గేమ్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎంజేపీ కూసుమంచి విద్యార్థి



ప్రజా స్ఫూర్తి, పాలేరు: సెప్టెంబర్ 12వ తేదీన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా ట్రైత్లాన్ పోటీలలో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం బీసీ గురుకులం విద్యార్థి, ఎనిమిదో తరగతి U14 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచాడు.లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, హై జంప్‌లో ప్రథమ స్థానం, 60 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో ఈ నెల 26, 27 తేదీలలో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి సిహెచ్.రాంబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ పి. మల్లయ్య, ఏటీపీ ప్రేమలత, డిప్యూటీ వార్డెన్ నరసింహారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బి. నరసింహారావు, టి. భాస్కర్, పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు. విద్యార్థి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్సీ హాస్టల్ విద్యార్థినులకు 'షీ టీమ్' అవగాహన




జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని ఎస్సీ రెసిడెన్షియల్ లో విద్యార్థినులకు 'షీ టీమ్' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు విద్యార్థినులకు భద్రతా చర్యలు, అత్యవసర నంబర్లు, సైబర్ వేధింపులు తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా ధైర్యం గా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. విద్యార్థినుల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

## జనగామలో స్కూల్ గేమ్స్ సందడి




జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణం లోని మినీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. కుడ్డి, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో సుమారు 2,400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు జీసీడీఓ గౌసియా బేగం చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## అయ్యప్పస్వామి దేవాలయంలో భక్తి శ్రద్ధలతో వరుణయాగం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని శబరినగర్ శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం వరుణయాగాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తాంత్రిక్ జ్ఞానసాయి శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రెంటాల సతీష్ శర్మ లోక కళ్యాణార్థం వర్షాలు కురవాలని పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని కోరుతూ 1008 కళశాలతో శతఘటాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి వరుణయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్ లినో ప్రభావంతో వర్షాలు రావడం లేదని మనం చేయాల్సిందల్లా దైవంపై భారం వేయడమే అన్నారు. అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వర్షాలు కురువాలని వరుణయాగం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరిశెట్టి లక్షాది, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కొండపల్లి దిలీప్ రెడ్డి, ఎలిమినేటి అభినయ్, చిలుముల సునీల్ రెడ్డి, వీరన్ననాయక్, ఆలయ కమిటీ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎల్గూరి రాంబాబు, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, గొట్టెముక్కల శ్రీనివాస్ రెడ్డి, మనసాని రామ్మూర్తి, చల్లా లక్ష్మీకాంత్, వేమిశెట్టి మధు, తోట రాజగోపాల్, భూపతి శ్రీనివాస్, అర్చకులు కోటేశ్వరశర్మ తదితరులు ఉన్నారు.

## భక్తితో వినాయక మండపం నిర్మించిన చిన్నారులు

*** పెద్దలు, కాలనీ వాసులు సహకరించాలని విజ్ఞప్తి**



జహీరాబాద్ ప్రజాస్ఫూర్తి: జహీరాబాద్ మహేంద్ర కాలనీ లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులు భక్తిశ్రద్ధలతో వినాయకుడి మండపాన్ని ఏర్పాటు చేశారు. తమ సొంత ప్రయత్నంతో మండపాన్ని అందంగా అలంకరించి గణనాథుడిని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశారు.చిన్నారుల భక్తి, ఉత్సాహాన్ని అభినందిస్తూ కాలనీలోని పెద్దలు, స్థానికులు వారికి అండగా నిలవాలని నిర్వాహకులు కోరారు. మండపం నిర్వహణ, పూజా కార్యక్రమాలకు కాలనీ వాసులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారులు ఐక్యంగా ముందుకు వచ్చి వినాయక మండపాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆపదలో ఆర్థిక అండగా సీఎం రిలీఫ్ ఫండ్

*** కౌన్సిలర్ బర్రె పూజిత–జహంగీర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : పేదల సంక్షేమమే లక్ష్యంగా, ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేద రోగులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నామని 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత-జహంగీర్,బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చొరవతో 23వ వార్డుకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అందులో,గంగారం సత్తయ్యకు రూ.54,000,కడారి గోపాల్‌కు రూ.7,500,కొండమడుగు యాదమ్మకు రూ.11,000,మొత్తం రూ.72,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.పేదవాడి కష్టంలో ప్రభుత్వం అండగా నిలవాలి.. వైద్యం కోసం ఆస్తులు అమ్ముకునే పరిస్థితి రాకూడదు" అనే లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ మజార్ బబ్లూ, బర్రె క్రాంతి, కడారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాల కు సెప్టెంబర్ 14 వరకు గడువు

జనగామ,ప్రజాస్ఫూర్తి : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ ఎన్నికల ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఆక్షేప ణలు ఉంటే 14వ తేదీలోపు లిఖితపూ ర్వకంగా సమర్పించాలని ఎన్నికల అధి కారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలి పారు.సెప్టెంబర్ 9న అర్హత కలిగిన ఓటర్ల జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. అభ్యంతరాలను జనగామ రెవెన్యూ డి విజనల్ అధికారి కార్యాలయంలోని ఎ న్నికల అధికారికి సమర్పించాలన్నారు. సెప్టెంబర్ 15న అభ్యంతరాలను పరిశీ లించి, అవసరమైన మార్పులు, చేర్పు లపై అభిప్రాయాలు స్వీకరిస్తామని, 16 న తుది నిర్ణయం కోసం రాష్ట్ర శాఖకు జాబితా పంపుతామని పేర్కొన్నారు. సె ప్టెంబర్ 19న తుది ఓటర్ల జాబితాతో పాటు ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి: కిషన్ రెడ్డి

హైదరాబాద్ : ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (JUA) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (IAF) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**

పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని అంటున్నారు.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..

కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. అదేవిధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దున నిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం. శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్

సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





## ఆ పాత్ర కోసం స్పెషల్ ట్రైనింగ్

దిగ్గజ సంగీత కళాకారిణి ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా ఓ పాన్ ఇండియన్ మూవీ రాబోతుంది. ఇందులో ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక మందన్న కనిపించబోతుంది. ఈ పాత్ర కోసం రష్మిక స్పెషల్ ట్రైనింగ్ తీసుకోబోతున్నట్లు సమాచారం. కట్టుబొట్టు విషయంలోనే కాకుండా వీణ పట్టుకోవడం, మ్యానరిజమ్స్, మాటతీరు అన్ని సుబ్బులక్ష్మిలాగే ఉండేలా రష్మిక జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. కొన్నాళ్లు శిక్షణ తీసుకున్న తర్వాతే షూటింగ్‌ను మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. కర్ణాటక సంగీతకళాకారిణిలతో కలిసి ఓ స్పెషల్ వర్క్‌షాప్‌ను నిర్వహించబోతున్నట్లు సమాచారం. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీవాస్ ఈ మూవీని నిర్మిస్తున్నారు.

## గెస్ట్ రోల్‌లో విరుష్క జోడి

బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ మూవీ హనుమాన్ అంశ్‌కు సీక్వెల్ రాబోతుంది. ఆధ్యాత్మిక గురువు కరోలీ బాబా జీవితం ఆధారంగా రూపొందిన ఈ మూవీ సీక్వెల్‌లో విరాట్ కోహ్లి, అనుష్క శర్మ గెస్ట్ రోల్స్‌లో కనిపించబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ సీక్వెల్‌లో నటించడానికి వీరిద్దరు అంగీకరించినట్లు చెబుతోన్నారు. పార్ట్ 2ను దర్శకనిర్మాతలు అఫీషియల్‌గా ప్రకటించారు. కోహ్లి, అనుష్క పాత్రలు హైలైట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. బాబా ఆధ్యాత్మిక బోధనల ప్రభావం వీరిద్దరి జీవితాల్లో ఎలాంటి మార్పులను తీసుకొచ్చాయన్నది చూపించబోతున్నట్లు తెలిసింది. అనుష్క శర్మ పాత్ర నిడివి ఎక్కువగానే ఉండబోతున్నట్లు చెబుతున్నారు. వీరితో పాటు హాలీవుడ్ హీరోయిన్ జులియా రాబర్ట్స్ కూడా అతిథిగా కనిపించే అవకాశం ఉందని సమాచారం.



## నేరుగా ఓటీటీలోకి కాశీ మజిలీ

మూడేళ్ల గ్యాప్ తర్వాత యాక్టర్‌గా రేణుదేశాయ్ రీఎంట్రీ ఇస్తోంది. కాశీ మజిలీ పేరుతో ఓ మినీ మూవీ చేసింది. హీరోయిన్‌గా నటిస్తూనే ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా రేణుదేశాయ్ అందించారు. కానీ ఈ సినిమా థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ కాబోతుంది. ఈ మూవీ ఈటీవీ విన్ ఓటీటీలో రేపటి నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ ట్రైలర్‌ను ఈటీవీ విన్ శనివారం రిలీజ్ చేసింది. కాశీ వచ్చిన ఓ మహిళ ఓ ఫొటోగ్రాఫర్‌తో కలిసి సాగించిన జర్నీ, ప్రేమ వంటి అంశాల చుట్టూ ఈ సినిమా సాగనున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. కాశీ విజువల్స్, మెలోడీ ప్రధానంగా సాగే మ్యూజిక్ ఆకట్టుకుంటున్నాయి. యమునా కిషోర్ దర్శకత్వం వహించగా జోశ్యభట్ల మ్యూజిక్ అందించారు.



## ఫ్యామిలీ ఇమేజుందని తెల్సు.. కానీ

వెంకటేష్ ఆదర్శ కుటుంబం మూవీ టీజర్ వచ్చేసింది. త్రివిక్రమ్ శైలి పంచ్‌లు, ఫ్యామిలీ ఎమోషన్స్, వెంకటేష్ కామెడీ టైమింగ్‌తో ఈ టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. భార్య చేసే అప్పుల కారణంగా ఇబ్బందులు పడే భర్తగా వెంకటేష్ కనిపించారు. డబ్బుకు సబ్బుకు ఓ పోలిక ఉంది. మొదటిది చూస్తుండగానే కరిగిపోతుంది. రెండోది ఆలోచించేలోపు అరిగిపోతుంది. నాకు ఫ్యామిలీ ఇమేజ్ ఉందని తెలుసు.. కానీ సిచ్యువేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చేయడానికి వెనుకాడను".. అంటూ వెంకటేష్ చెప్పిన డైలాగ్స్ హైలైట్‌గా నిలిచాయి. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోండగా తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. పోస్ట్‌పోన్ రూమర్లకు మేకర్స్ చెక్ పెడుతూ అక్టోబర్ 2నే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు.



## లండన్‌లో విజయ్-త్రిష సందడి!

తమిళనాడు సీఎం దళపతి విజయ్, చెన్నై క్వీన్ త్రిష లండన్‌లో ఒకే వేదిక మరోసారి కలిసి కనిపించబోతున్నారా అంటే ఔననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. పెట్టుబడుల సేకరణ నిమిత్తం దళపతి విజయ్ ఇటీవలే లండన్ వెళ్లగా త్రిష హీరోయిన్‌గా చేస్తున్న ఓ సైకలాజికల్ హారర్ మూవీ షూటింగ్ కోసం లండన్‌లోనే ఉంది. వీరిద్దరూ ఓ ఈవెంట్‌లో సందడి చేయబోతున్నట్లు సమాచారం. శనివారం జరుగనున్న మిచెలిన్ లీ మాన్స్ కప్ మోటార్ రేసింగ్ పోటీల్లో అజిత్ పాల్గొంటున్నాడు. ఈ రేసింగ్ పోటీలకు చీఫ్ గెస్ట్‌గా విజయ్ అటెండ్ కాబోతున్నారు. ఈ వేడుకలకు త్రిష కూడా అటెండ్ కానున్నట్లు సమాచారం. విదేశాల్లో విజయ్, త్రిష ఒకే ఈవెంట్‌లో కలిసి కనిపించబోతుండటం అభిమానుల్లో ఆసక్తికరంగా మారింది. త్రిషతో దిగిన ఓ సెల్ఫీ ఫొటోను రాధిక ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.